డిలా కన్పించింది. ఛ— ఈ తెలుగువాళ్ళకి సీత, సుబ్బలక్ష్మి, రుక్మిణి, సూర్యకాంతం లాంటిపేర్లు తప్ప తట్టవు. తన కాలేజీలో అమ్మాయిల పేర్లు ఎంత నాజూగ్గా వుంటాయి. సుచరిత, సుస్మిత, సీమ, సుప్రియ, తనూజ వగైరా వగైరాలంతా ఎంత అదృష్టవంతులో ! ఆఖరికి పోనీ ముందో వెనకో కత్తిరించి, నాజూగ్గా పొట్టిచేసుకునే వీలయినా కనపడకపోయే - సరికి పేరు మార్చేసుకోవాలనే అభిప్రాయానికి వచ్చేసింది రుక్మిణి. "అయ్యో యిదేం విడ్డూరమే !" బుగ్గలు నొక్కుకుంది బామ్మ ఆమాట విని. "చాల్లే పిచ్చివేషాలుమాను" కసిరింది తల్లి. "బామ్మ బాధపడ్తుంది తల్లీ" అని తండ్రి. ఖర్మకాలి బామ్మపేరు తనకే పెట్టాలా ! బామ్మ బతి కుండగా తను పేరు మార్చుకోడం ఉత్తమాట ! పాపం బామ్మ మంచిదే. పేరింటిగత్తె అని తనకి తన నాలుగుపేటల చంద్రహారం యిచ్చింది. చక్కా అది చెరిపించి ఈనాటి ఫేషన్‌కి తగ్గట్టు దవురుగళ్ళీ నెక్లెస్, వెడల్పు గాజులు, చాటంత బంగారు దుద్దులు అన్నీ సెట్టుగా చేయించుకుంటాననంది. "నిక్షేపంలాంటి పెద్దగొలుసు చెరిపించక" అంటూ గోల పెట్టింది బామ్మ. అదృష్టవశాత్తూ ఈలోగా ఏదో సినిమాలో హీరోయిన్, నాలుగుపేటల చంద్రహారం గొలుసూ రెండు పేటలు క్రిందికి పొడుగ్గా పడేట్టు వ్రేలాడ దీసింది. అదిచూసి మర్నాడు రుక్మిణి అలావేసుకు వెళ్ళింది. ఆ మర్నాటి నించి ఆడపిల్లలంతా అమ్మల్ని, బామ్మల్ని పీడించి బీరువాలో పడేసిన చంద్రహారాలు, పలకసర్లు తీసి వేసుకెళ్ళడం ఆరంభించారు. చంద్రహారం ఫేషన్ అయికూర్చుంది. అలాగే పోనీ పాతపేర్లు ఫేషన్ అవుతే బావుండ నుకుంది రుక్మిణి.

పోనీ పేరుకి ఏలాగో సరిపెట్టుకుంది. ఆఖరికి యిష్టం వచ్చిన డ్రస్సులయినా వేసుకోనిస్తేనా ! యింట్లో. ముచ్చటపడి బెల్‌బాటమ్స్ కుట్టించుకుంటాననంటే, ఎవడితోనో లేచిపోతున్నంత గొడవ చేశారు పాపం. "ఇదేం పొయ్యేకాలమే ! మొగాడిలాగ పేంట్లు తొడుక్కుంటాననంటావు. ఆడపిల్లవు ! పెళ్ళీడుకొచ్చిన దానివి" అంటూ బామ్మ నోరు నొక్కు కోడం. "ఇదిగో అవన్నీ మనలాంటి వాళ్ళకికాదు. ఊరికే పదిసార్లు విసిగించకు "తల్లి కసుర్లు. ఆఖరికి ఏడ్చి వస్తులుండి సాధించి

ఒకటి కుట్టించుకుంది రుక్మిణి. అది తొడుక్కున్నప్పుడల్లా యింట్లోవాళ్ళ చూపులు విసుర్లు చూసేసరికి, దానిమీద మోజుకాస్తా చచ్చిపోయింది రుక్మిణికి. ఛీ - వీళ్ళంతా పదో శతాబ్దంలో పుట్టాల్సినవాళ్ళు. యీ యింట్లో వున్నన్ని రోజులు తనఖర్మ యింతే_ యిలాంటిచోట పుట్టడం దురదృష్టం. పెళ్ళిఅయి వెళ్ళాక చూపిస్తుంది తన అభిరుచి. పెళ్ళి అయ్యాక తన కలలు పండించుకోవాలని నిర్ణయించుకుంది,

కాని పెళ్ళివిషయంలో కూడా రుక్మిణి **ఆశలు** అడియాసలు అయిపోయాయి, పాపం. సినిమాలు చూసి నవలలు చదివి ఆ హీరోల్లాంటి హీరో - **ఆ**జానుబాహువు, అరవింద దళాయతాక్షుడు వగైరా వగైరాలున్న ఓ రూపు సిద్ధం చేసుకుంది రుక్మిణి మనసుకు.

తీరా పెళ్ళిచూపుల్లో సుబ్బారావునిచూసి నీళ్ళుగారిపోయింది రుక్మిణి. సుబ్బారావు, ఛ - పేరే బాగాలేదే - ఏ రాజశేఖరమో, విజయసారధో - నళినీమోహనుడో ఎన్ని పేర్లుకావు. తన పేరుకంటేకూడా అసహ్యంగా వుందనుకుంది రుక్మిణి. పేరుసరే, మనిషో - అతడు **ఆ**రడుగులు కాదు 5-6, అంగుళాలుకూడా లేడు. మహావుంటే 5-4" వుంటాడు సన్నగా బక్కపలచగా చామనచాయ రంగులో వున్నాడు. పోనీ రూపు సరే - కనీసం కథల్లోగ ప్రవర్తించాడా, చిలిపిగా చూశాడా! కొంటెగా నవ్వాడా! "మీతో ప్రత్యేకంగా మాట్లాడాలి, అలా డ్రైవ్ కెళదామా" అని **ఆ**హ్వానించాడా." ఏం లేదు. తనకంటె నెర్వస్‌గా కూర్చున్నాడు. మాటిమాటికి కళ్ళజోడు తీసి తుడుస్తూ (హీరోలకి కళ్ళజోడు వుండచ్చా) పెద్దవాళ్ళ మాటలు వింటూ ముంగిలా కూర్చున్నాడు. ఛా - అనుకుంది రుక్మిణి నచ్చలేదు పొమ్మంది, పెద్దవాళ్ళు అడగ్గానే. అంతా తెల్లబోయారు. పిచ్చి పట్టలేదుగదా అన్నట్టు చూశారు రుక్మిణిని. అంతకంటే మంచి సంబంధం మరో జన్మ ఎత్తినా - తేలేం అన్నారు.

పిల్లాడు బుద్ధిమంతుడు. కాలేజీలో లెక్చరరు. **ఆ**రేడు వందలు తెచ్చుకుంటాడు. బాదరబందీలు లేవు. యింతకంటే మంచి సంబంధం తపస్సు చేసినా దొరకదు- **అ**ంతకంటే తెచ్చే తాహతూలేదు- అంటూ నచ్చ

జెప్పి, బతిమాలి, బెదిరించి, తిట్టి అందరూ కలిసి వప్పించారు రుక్మిణీని. "హు - యీ దేశంలో పుట్టిన ఆడపిల్లని యింతకంటె ఏం చెయ్యగలను" అనే ఓ నవల్లో డైలాగు గుర్తుతెచ్చుకుని, మూగగా రోదించి పెళ్ళిపీటల మీద కూర్చుంది రుక్మిణి.

సుబ్బారావు తనూహించిన హీరోకి రూపంలోనేకాక, ఏ విషయం లోనూ సరితూగడని రుక్మిణికి చాలా కొద్ది రోజులలోనే అర్థం అయి పోయింది. సుబ్బారావు మంచివాడవుగాక! మంచితనం ఒక్కటీ సరి పోతుందా. ఆడదాన్ని ఆకట్టుకొనే శక్తి వుండొద్దూ మగాడికి. పెళ్లాం అనగానే జీతం డబ్బులు తెచ్చిచ్చి, ఏ వారానికో ఓ సారి సినిమాకి తీసి కెళ్ళి, ఏ ఆర్నెల్లకో ఓ చీరకొంటే సరిపోతుందా. పెళ్ళాం కోరేవి యింతేనా? రుక్మిణి ఆలోచనలివి. రుక్మిణికి అసంతృప్తి రోజురోజుకి పెరిగిపోతూంది.

సుబ్బారావు ప్రతిచర్యలో, తన హీరోనీడన్నా ఎక్కడన్నా కనిపిస్తుం దేమోనని ఆరాటంగా వెతికేది. ఊహుఁ. సుబ్బారావు అదేం గుర్తించేవాడు కాడు. గుర్తించాలని తెలియదుకూడా అతనికి. ఏదో వేళకింతతిని, కాలేజీకి వెళ్లి పాఠాలు చెప్పుకుని, మిగతా సమయంలో డాక్టరేటు తెచ్చుకోడానికి, థీసీస్ వ్రాస్తున్నాడేమో! ఎప్పుడూ ఏ లైబ్రరీలోనో పుస్తకాలు వెతుక్కుంటూ ఆ పుస్తకాలు యింటికి తెచ్చుకుని తలదూర్చుకుంటాడు. అలాంటి సమ యాల్లో రుక్మిణికి వళ్ళుమండుకొస్తుంటుంది. ఇదేం మనిషి కొత్తపెళ్లాంతో సరసాలాడాలని, సినిమాలో మాదిరి మల్లెపూలు తెచ్చి పెళ్ళాం జడలో తురమాలని, సాయంత్రాలు ఏ డాబామీదో వళ్ళో తలపెట్టుకు పడుకుని కబుర్లు చెప్పాలని, వంటింట్లో పెళ్లాం కొంగు పట్టుకు తిరగాలని, అన్నం తింటూ ఒకరినోట్లో వకరు తినిపించుకోడాలు, వగైరా సరదాలుంటాయని ఈ పురుష పుంగవుడికి తెలియదా, అని కోపంతోపాటు ఉక్రోషం వచ్చేది. పోనీ హీరోలా కాకపోయినా హీరో గుణాలన్నా వుంటే సరిపెట్టుకునేది రుక్మిణి. పెద్ద ఛాతీ కాకపోయినా ఆ బక్క ఛాతీమీదే తల ఆన్చి మైమరు ద్దామనుకుంది. కానీ ఆ మహానుభావుడు ఆ అవకాశం యిస్తేనా?

